క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అధ్యక్ష పదవుల్లో యువతకు చోటు



చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీకి మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా షేక్ దరియావలి, రూరల్ మండలం అధ్యక్షుడిగా దేవినేని శంకరరావు, నాదెండ్ల మండలం మంగు ఏడుకొండలు, యడ్లపాడు అధ్యక్షుడిగా వడ్డేపల్లి నరసింహరావు(రాజు) ఎంపికై నట్లు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి వీరంతా నాయకులకు వెన్నుముకగా నిలిచి పనిచేస్తుండటంతో వీరికి ఈ సముచితస్థానాన్ని కల్పించినట్లు మాజీమంత్రి విడదల రజిని తెలిపారు.

మండల వ్యవసాయ అధికారిగా శాంతి



నరసరావుపేట రూరల్: మండల వ్యవసాయ అధికారిగా ఐ.శాంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా పెదకూరపాడు మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఏవోగా విధులు నిర్వహించిన నరేంద్రబాబు బదిలీపై కొల్లూరు మండలం వెళ్లారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన శాంతికి ఏఈవోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు అభినందనలు తెలిపారు.

నూజెండ్లలో...



నూజెండ్ల: మండల వ్యవసాయాధికారిగా ఆంజనేయులు నాయక్ శుక్రవారం విధుల్లో చేరారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం నుంచి బదిలీపై రావటం జరిగింది. ఇప్పటి వరకూ పని చేసిన సుగుణాబేగం ప్రత్తిపాడు మండలం వెళ్లారు. క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ఆధునిక వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కల్పిస్తానని ఏవో ఆంజనేయులు నాయక్ అన్నారు. త్వరలో విడుదల కానున్న అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలో 10,148 మంది రైతులు అర్హత సాధించగా వారందరికీ ఈకేవైసీ పూర్తి చేయిస్తున్నామన్నారు. అలాగే మండలంలో విస్తరణాధికారులుగా నూజెండ్ల, ఐనవోలుకు ఎలీషా, ములకలూరు పరిధిలో కృష్ణవేణి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల: మండలంలోని అన్ని సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కె. రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం కనుక పిడుగురాళ్ళ 220 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామన్నారు. అదే విధంగా మండలంలో రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చి బాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం సబ్ స్టేషన్ పరిధిలోగల అన్ని 33 కేవీ, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు పనుల నిమిత్తం అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. త్రీఫేస్ విద్యుత్ శనివారం ఉదయం ఒంటి గంట నుంచి 9 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాబట్టి విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వినుకొండ వెటర్నరీ ఏడీగా శ్రీరాములు

వినుకొండ: వినుకొండ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్.శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా జిల్లా త్రిపురాంతకం నుంచి బదిలిపై వచ్చారు. గతంలో పనిచేసిన సరోజినిదేవి గురుజాల బదిలీ పై వెళ్లారు. ఈసందర్భంగా వెటర్నరీ డాక్టర్లు అమీర్ భాషాతోపాటు ఐదు మండలాల్లో డాక్టర్లు ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలో పశువైద్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయనతెలిపారు.

రొంపిచర్ల గ్రామాల్లో తేలికపాటి వర్షం

రొంపిచర్ల: మండలంలోని ఉత్తర దిక్కుగా ఉన్న గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం ఉదయానికి 5.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి, చాకలికుంట, మర్రిచెట్టుపాలెం తదితర గ్రామాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు మెట్ట భూములకు ఎంతగానో మంచిదని రైతులు తెలుపుతున్నారు. మాగాణి, మెట్ట పొలాలు దుక్కులు దున్నుకునేందుకు అనుకూలమన్నారు. కంది, పత్తి, పంటలు సాగుతో పాటు మాగాణి పొలాల్లో భూసారాన్ని ఇచ్చే పచ్చి రొట్ట పైర్లను కూడా సాగు చేసేందుకు అనుకూలమన్నారు.



గోతులమయంగా మారిన రోడ్లు





అధ్వాన్నంగా మారిన రోడ్డు

చంద్రన్న... మా రోడ్డు చూడన్నా

ఆరునెలల్లోనే రోడ్లుకు మరమ్మతులు పూర్తిచేస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా గోనెపూడి రోడ్డు దశ మారలేదు. చినతురకపాలెం– గోనెపూడి గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. పలుచోట్ల బీటీ కూడా లేకపోవడంతో కంకర బయట పడింది. ఈ రోడ్డు నుంచి గోనెపూడి, చింతలపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల కోసం పాఠశాలల బస్సులు ఈ రోడ్డు నుంచి రవాణా సాగిస్తుంటాయి. గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

–నరసరావుపేట రూరల్

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వర ప్రసాద్

నూజెండ్ల: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయటంలో విఫలమయ్యాయని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వర ప్రసాద్ విమర్శించారు. మండలంలో శుక్రవారం జరిగిన 5 వ మహాసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న అప్రజాసామ్య విధానాలను ఖండిస్తూ తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ పార్టీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాల నాయకులపై ఈడీ చట్టాలను ఉపయోగించి వారిపై అక్రమ కేసులు బనాయించి తమ పార్టీలోకి మారేలా ప్రతిపక్ష పార్టీలను బలహీన పరుస్తుందన్నారు. కేంద్రం రాష్ట్రాలో తమ పెత్తనం కొనసాగిస్తూ దేశ సంపదలను అంబానీ, అదానీలకు దోచి పెడుతోందని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పార్టీ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల కార్యదర్శిగా పవన్ కుమార్, సహాయ కార్యదర్శిగా కాకర్ల కొండలు, కె.ఆంజనేయులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, రాయబారం వందనం, కొప్పరపు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

నేడు గణపవరంలో ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన గణపతి, వాసవీ కన్యకాపరమేశ్వరి సహిత శ్రీ కోదండ రామస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన కోదండ రామాలయం శిథిలావస్థకు చేరటంతో, 2015లో దీని స్థానంలో గ్రామస్తులు నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు, దాతల సహకారంతో 2023 జూన్ 7న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే విగ్రహం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. శనివారం ఉదయం అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ సుదర్శన హోమం, సాయంత్రం సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం జరిగే అభిషేకాలు, హోమాల్లో పాల్గొనే భక్తులు వారి చిరునామాలను ఆలయ ప్రధాన అర్చకులు దర్భ అనిల్‌కుమార్ శర్మ, ఉమామహేశ్వర శర్మల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. సాయంత్రం మహిళలతో కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

తల్లికి వందనం నిష్పక్షపాతంగా అమలు చేయాలి

ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం పేరుతో పంగనామలు పెట్టకుండా నిష్పక్షపాతంగా అమలుచేయాలని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ ప్రచారం చేసుకున్న కూటమి ప్రభుత్వం ఈ రోజు రూ.13 వేలు ఖాతాలో జమచేసి అందులో రూ.2 వేలు స్కూల్స్ మరమ్మతులు అంటూ కట్ చేశారన్నారు. అలానే 300 యూనిట్ల కరెంటు బిల్లు దాటితే పథకం వర్తించదనీ, కారు, సొంత ఇల్లు ఉన్న తల్లికి వందనం పథకం రాదంటూ కోతలు పెట్టడం చూస్తుంటే అసలు ఈ పథకం కూటమి కార్యకర్తలకు మాత్రమే అమలు చేస్తున్నట్టుగా ఉందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు నడిపిస్తూ తల్లికి వందనం ఏమో కానీ నాన్నకు ఇంధనం (మద్యం) మాత్రం కూటమి ప్రభుత్వం పల్లె నుంచి పట్నం వరకు ప్రతిచోట అందజేస్తుందని మౌలాలి ఎద్దేవా చేశారు. తల్లికి వందనం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని మౌలాలి కోరారు.

దళితుడిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

డిమాండ్ చేసిన మాలమహానాడు అధ్యక్షుడు జాన్‌పాల్

నరసరావుపేట: నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన బొడ్డు రామారావు అనే దళితుడిని కులం పేరుతో దూషించి దాడిచేసిన అదే గ్రామానికి చెందిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామారావును పరామర్శించి మీడియాతో మాట్లాడారు. ఈ నెల తొమ్మిదవ తేదీ సాయంత్రం మంచినీటి కోసం పల్లె నుండి ఊర్లోకి వెళ్లి వస్తున్న సమయంలో బాధితుడు రామారావుపై గ్రామానికి చెందిన కొంతమంది అతి కిరాతకంగా పాశవికంగా కర్రలు, రాడ్లతో దాడి చేశారన్నారు.

తక్షణమే ముద్దాయిలని అరెస్ట్ చేసి కఠినమైన శిక్షలు పడేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సామేలు, బాధితుడు భార్యతో పాటు బంధువులు పాల్గొన్నారు.

సాయికార్తీక సిటీ సెంటర్‌లో మరో వివాదం

- తీసుకున్న అప్పు చెల్లించాలంటూ పలువురు డిమాండ్
- పలుమార్లు యజమాని–అప్పు ఇచ్చిన వారి మధ్య వాగ్వాదం



డబ్బుల విషయమై ప్రశ్నిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: పట్టణంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సాయికార్తీక్ సిటీ సెంటర్ వివాదం మరోమారు తెరపైకి వచ్చింది. యజమాని రావి సుధాకర్ దంపతులు శుక్రవారం సిటీ సెంటర్‌కు వచ్చారని తెలిసి, కొందరు మీడియాను వెంట బెట్టుకుని అక్కడికి వచ్చారు. తేలప్రోలు వీరయ్య చౌదరి, ప్రసాద్‌తో పాటు మరికొందరు సుధాకర్ దంపతుల వద్దకు వెళ్లి రూ.60 కోట్ల ఆస్తులు ఉన్నాయంటూ చెప్పి తమవద్ద తీసుకున్న సుమారు రూ.7.5 కోట్లు తిరిగి ఇచ్చేయాలంటూ అడిగారు. తమ భవనం ఎదుట నిరసన చేయడం, దూషించడంతో తాను చచ్చినట్లేనని ఇక అప్పు విషయం గురించి తన కుమారుడిని అడగాలంటూ చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పు ఎలా వసూలు చేసుకోవాలో మాకు తెలుసంటు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా బాధితుల్లో ఒకరైన తేలప్రోలు వీరయ్య చౌదరి మీడియాతో మాట్లాడారు. రావి సుధాకర్‌ను చూసే తాము డబ్బులు ఇచ్చిన ఎలాంటి సంబంధం లేదని, తన కుమారుడినే అడగాలంటూ మాట దాటేస్తున్నారని చెప్పడం సమంజసం కాదన్నారు. వీరి కుటుంబ సభ్యులు ఇటీవల హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి తమ ఆస్తి సాయికార్తీక్ సిటీసెంటర్‌ను ఆక్రమించుకున్నారంటూ ఆరోపించారన్నారు. అయితే తాము భవనాన్ని ఆక్రమించుకుంటే రావి సుధాకర్ అందులో ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. కేవలం తామిచ్చిన నగదు మాత్రమే తిరిగి ఇచ్చేయాలని తేలప్రోలు వీరయ్య చౌదరి, ప్రసాద్ తదితరులు మీడియా ముందు విజ్ఞప్తి చేశారు.

17న మండల పరిషత్ సమావేశం

రొంపిచర్ల: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మ్యాథ్యూబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గడ్డం బాలనాగమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, అధ్యక్షులవారి అనుమతితో ఇతర అంశాలపై సమీక్షించటం జరుగుతుందన్నారు. ఈ మేరకు అందరి ఎంపీటీసీ సభ్యులకు, జెడ్పీటీసీ సభ్యుడికి, కో–ఆప్షన్ సభ్యులకు శాశ్విత ఆహ్వానితులకు, మండల అధికారులకు, అన్ని పంచాయతీల కార్యదర్శులకు సర్క్యులర్‌లు పంపామన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

శావల్యాపురం: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుసేవా కేంద్రాల్లో అర్హత కల్గియున్న రైతులు ఈకేవైసీ నమోదు చేయించాలని ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని 11 రైతుసేవా కేంద్రాల్లో 6310 రైతులు రికార్డు నమోదు కాగా వీరందరు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈపథకానికి సంబంధించి నేటికి రికార్డులు అందజేయని వారందరూ మళ్లీ నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక రైతు ఒకచోట మాత్రమే ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారందరూ ఏరియాలో రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకుంటే అర్హత పొందుతారన్నారు. ఈపూరు మండలంలో 12 రైతుసేవా కేంద్రాలు ఉండగా 8246 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేయించాలన్నారు. ఈకైవైసీ నమోదైన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హత పొందుతారన్నారు.

బీరువాలు బహూకరణ

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం కొత్తపల్లి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో రూ.25 వేల రూపాయల విలువ చేసే రెండు బీరువాలను బహూకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ డి.బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. పాఠశాలలకు కావలసిన వస్తువులను దాతలు, పూర్వ విద్యార్థులు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు వై. మల్లిఖార్జునరావు, మొగల్ శ్యామ్ రావు, ఉపాధ్యాయులు భీష్మారావు, జయప్రకాశ్, అఫ్జల్, నువర్రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



యడ్లపాడు: పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీ (మంగల) కాలనీలో విద్యుదాఘాతంతో 15 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. నాదెండ్ల కిరణ్ బాబు తల్లి శివకుమారితో కలిసి కాలనీలో తల్లితో కలిసి నివసిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కుటుంబ భారాన్ని భుజాలపై ఎత్తుకున్నాడు. మైదవోలు వెళ్లే రహదారిపై వైఎస్సార్ విగ్రహం సమీపంలో సొంతంగా ఒక చిన్న టిఫిన్ హోటల్ నిర్వహించి, కుటుంబానికి అండగా ఉంటున్నాడు. అయితే హోటల్‌లో పనులు చేస్తున్నప్పుడు పిండి గ్రైండ్ చేయడానికి గ్రైండర్‌ను ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మార స్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవే టు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని ఇరువురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

నాదెండ్ల: జాతీయ రహదారిని దాటుతున్న ఇరువురు కార్మికులను గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిషాకు చెందిన అంకిత్ బోరా, ప్రమోద్ బెహ్రా స్థానిక నూలు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇరువురూ గణపవరం వద్ద జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఇరువురూ సుమారు 10 అడుగులు పైకి లేచి కారు అద్దాలపై పడ్డారు. ఇరువురికి గాయాలు కావటంతో 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రెడ్‌క్రాస్ సేవకులు అభినందనీయులు

రిబ్బన్ కట్‌చేసి శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ



శిబిరాన్ని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎస్‌బీఐ ఆర్ఎం, రెడ్‌క్రాస్ చైర్మన్

నరసరావుపేట: ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే ఆలోచన చాలా గొప్పదని, అందుకు కృషిచేస్తున్న ఎస్‌బీఐ, రెడ్‌క్రాస్ అభినందనీయులని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ అరుణ్‌బాబు మార్గదర్శకత్వంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్‌బీఐ ఏర్పాటు చేసి 70 ఏళ్లు గడిచిన సందర్భంగా రీజినల్ మేనేజర్ పి.రవికుమార్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినందుకు అభినందించారు. దాతలు అందించే ప్రతి ఒక్క రక్తపుబొట్టు వృథాకాకుండా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలుపుతుందన్నారు. ముఖ్యంగా రహదారి ప్రమాదాలు, గురువారం జరిగిన విమాన ప్రమాదాలు వంటి సమయాల్లో క్షతగాత్రులకు రక్తం అవసరమవుతుందని తెలియజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ రక్తం గ్రూపులను ఆవిష్కరించిన కార్ల ల్యాండ్ స్టీనర్ జన్మదిన సందర్భంగా ప్రపంచ రక్తదాత దినోత్సవ వారోత్సవాలు జరుపుకుంటున్నామని, 70 ఏళ్లు పూర్తిచేసుకున్న ఎస్‌బీఐ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో 32 మంది రక్తదానం చేశారన్నారు. రవి కుమార్ మాట్లాడుతూ ఎస్‌బీఐ 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రెండు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, అందులో మొదటిది ఈ నెల 9 నుంచి 13 వరకు దేశానికి వెన్నెముక రైతు అనే కార్యక్రమమన్నారు.

దీనిలో రైతులను మినిస్ట్రీ ఫార్మింగ్ నుంచి కమర్షియల్ ఫార్మింగ్‌కు మార్చే కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. రెండోది అత్యంత ప్రాముఖ్యత కలిగిన రక్తదాన శిబిరాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడమన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్త, డాక్టర్ రహమతుల్లా, హెచ్‌ఆర్ మేనేజర్ ఎం. గోపయ్య, చీఫ్ మేనేజర్ జి.బాలగణేష్, రీజినల్ సెక్రటరీస్ బి.చిన్నపరెడ్డి, పీఎంవీ రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేటటౌన్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శుక్రవారం సుగాలీ కాలనీలో నివాసముంటున్న దివ్యాంగురాలు కోటమ్మబాయికి ట్రైసైకిల్ అందజేశారు. స్వాతి జ్యువెలర్స్ అధినేత కొత్తూరి సూర్యనారాయణ ఆర్థిక సహాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ..ఇన్నర్‌వీల్ క్లబ్ స్నేహం, సేవ అనే దృక్పథంతో నడుస్తోందన్నారు. గతంలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి, సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు పలువురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, పూర్వాధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, డాక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దశమ భాగం పొదుపుతోనే ఎదుగుదల

ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి

నాదెండ్ల: ప్రతి వ్యక్తి సంపాదనలో దశమ భాగం పొదుపుకు కేటాయించాలని ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో భారతీయ రిజర్వుబ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలంటే పొదుపు చేయటం ద్వారానే సాధ్యమౌతుందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తమ కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టాలన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు బ్యాంకుల్లో పొదుపు ఖాతాలను సక్రమంగా వినియోగించుకుని సిబిల్ స్కోర్ పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా కుటుంబాన్ని అభివృద్ధి పరచుకోవాలన్నారు. నాదెండ్ల బరోడా బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా పొందే ప్రతి రుణం సకాలంలో చెల్లించి తిరిగి మరింత రుణం పొందే అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు ద్వారా ప్రతి ఖాతాదారుడు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష లాంటి బీమా పథకాలు పొందాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, ఏపీఎం రమేష్, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, మంగయ్య, వెలుగు కో ఆర్డినేటర్ సాంబశివ రావు, హేమలత, సుధ, శౌరయ్య, నాగేశ్వరరావు, యానిమేటర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పరిసరాల్లో నేడు విద్యుత్ నిలిపివేత

చిలకలూరిపేట టౌన్ /యడ్లపాడు: విద్యుత్ సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల కారణంగా నియోజకవర్గ పట్టణంతో పాటు మూడు మండలాల్లో రెండవ శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు. చిలకలూరిపేట పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేసే ప్రాంతాలు టౌన్ 1 పరిధిలో ఎస్‌ఆర్‌టీ సెంటర్, గాంధీపేట, సుబ్బయ్య తోట, చీరాల రోడ్, మద్దినగర్, కొమరవల్లిపాడు ప్రాంతాలు కాగా, టౌన్ 2 పరిధిలో సుభానినగర్, రాగన్నపాలెం, గుండయ్య తోట, బొందిలిపాలెం, ఆవులదొడ్డి, వడ్డెరపాలెం, పురుషోత్తపట్నం, అడ్డరోడ్డు సెంటర్, సుగాలి కాలనీ, భావనారుషి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు. మండలాల వారీగా... చిలకలూరిపేట రూరల్ మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మానుకొండవారిపాలెం, మిట్టపాలెం, గొట్టిపాడు, దండమూడి, నాగభైరువారిపాలెం, గుదేవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, పసుమర్రు, మద్దిరాల, మురికిపూడి, గంగన్నపాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, కోమటనేని వారిపాలెం, యడవల్లి గ్రామాలు విద్యుత్ సరఫరా ఉండదు. యడ్లపాడు–నాదెండ్ల మండలాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండు మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదు.

డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం

- చెత్త ఫిల్టరింగ్ అండ్ లిఫ్టింగ్ మెషీన్ ఏర్పాటు
- మెషీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన మెషీన్

నరసరావుపేట: దశాబ్దాలుగా ఉన్న దుర్గంత భరితమైన డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం కలగనుంది. సుమారు రూ.2 కోట్లతో ఫిల్టరింగ్ అండ్ లిఫ్టింగ్ మిషనరీ ఏర్పాటు చేశారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం గుంటూరు బైపాస్‌రోడ్‌లోని డంపింగ్ యార్డులో (బయో రెమిడీషన్) కాలుష్య రహిత వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి మున్సిపల్ కమిషనర్ యశ్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ఉన్న ఇక్కడ వ్యర్థాలను బయో రెమిడేషన్ ద్వారా వేరుచేసి వర్మీ కంపోస్ట్ గాను, మిగిలిన వ్యర్థాలను జిందాల్‌కు తరలించి విద్యుత్ ఉత్పత్తిగాను ఉపయోగించుకునే అవకాశం ఉందని వివరించారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డు స్థలం ఖాళీచేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ యశ్వంతరావు మాట్లాడుతూ 9.5 ఎకరాల విస్తీర్ణంలో 1.09,916 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు దీర్ఘకాలికంగా పేరుకుపోయి ఉన్నాయన్నారు. ఈ వ్యర్థాల నిర్వహణ ద్వారా కాలుష్య రహిత వాతావరణం ఏర్పడుతుందని ఆయన వివరించారు. మున్సిపల్ ఇంజనీరు కనకారావు, డీఇ షేక్ మహమద్ రఫీ, నాయకులు వాసిరెడ్డి రవి, ఏఎంసీ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయకుమార్, మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com